ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూజల్లో కార్పొరేటర్ శ్రవణ్ తదితరులు

మల్కాజిగిరి: సిద్ధేశ్వరీ పీఠ పాలిత వారాహీ, ప్రత్యంగిరా సహిత షిర్డీ సాయిబాబా ఆలయ వార్షిక బ్రహోత్సవాలు ఆదివారం ముగిశాయి. పీఠ కార్యదర్శి మునిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చివరి రోజు యాగా పూర్ణాహుతి, కుంభ సంప్రోక్షణ, కుంకుమార్చన , అన్నాభిషేకం, పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణ, లక్ష్మణ్‌రావు, శ్రీకాంత్, రాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: సురేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో అల్వాల్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉత్తమ సేవా రత్న అవార్డు గ్రహీత, బీఆర్‌ఎస్ నాయకులు మరల సురేశ్, రమేశ్, ప్రశాంత్‌రెడ్డి, పవన్, సభ్యులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



మల్లాపూర్: అక్కమహంకాళి, కామరాతి సమేత బీరప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా జెట్టా శ్రీశైలం, వైస్ చైర్మన్లుగా వస్పరి శ్రీనివాస్, కంది రాములు, ప్రధాన కార్యదర్శిగా వనకాల వీరేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కొక్కలకొండ రవి, సీతాల ఐలయ్య, జంగయ్య, సూర్ణం శివ, సంయుక్త కార్యదర్శులుగా బుగ్గ గణేశ్, కోటి, దొడ్డి నర్సింహ, రవీందర్, ప్రచార కార్యదర్శులుగా బెల్లం రవికుమార్, మేకల నర్సింహ, బుచ్చేందర్, యాకరాజు, కోశాధికారిగా చిరునాగుల వీరేశ్ తదితరులు ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



నాచారంలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ గణేశ్

మల్లాపూర్: అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు నాచారం అగ్నిమాపక శాఖ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎస్.గణేశ్ ఆధ్వర్యంలో మల్లాపూర్, నాచారంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం అందించాలన్నారు. అనంతరం రిటైర్డ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మల్లేశ్‌ను సత్కారించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: తెలంగాణ గిరిజన సమాఖ్య మేడ్చల్–మల్కాజిగిరి ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్‌లో గిరిజన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శి స్వరూప, శ్యామలత ఆధ్వర్యంలో ఆదివారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గిరిజనులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, ఐక్యంగా పోరాటాలు చేసి తమ హక్కులు సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, పద్మమ్మ, లావణ్య, రేణుక, అమృతమ్మ, సత్తమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా తవ్వకాలు..!

- అనుమతుల్లేకుండానే రోడ్డు కటింగ్ పనులు
- ప్రమాదాలకు నెలవుగా మారుతున్న వైనం
- మరోవైపు ఆదాయం కోల్పోతున్న నగర పాలక సంస్థ
- పట్టించుకోని అధికారులు



వాసవీనగర్‌లో డ్రైనేజీ కోసం తవ్విన రోడ్డు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని రోడ్లను కొందరు ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. తాగునీటి పైపులైన్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాల కోసం అంటూ అధికారుల నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండానే రోడ్లను తవ్వి నామమాత్రంగా పూడ్చివేస్తుండడంతో వాహనదారులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేగాకుండా రోడ్డు కటింగ్ పనుల వల్ల అటు నగర పాలక సంస్థ ఆదాయం సైతం కోల్పోతోంది.

జీవో ఎంఎస్ నంబర్ 48 నిబంధనల ప్రకారం ..

నగర పాలక సంస్థ పరిధిలో నూతనంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులు చేపట్టే ముందు ఇంటి యజమానులు జీవో ఎంఎస్ నంబర్ 48 నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలి. ఆపై ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలి. సదరు పనులు పూర్తయిన అనంతరం తవ్విన పైపులైన్‌పై ప్రాపర్‌గా రోడ్డును పూడ్చాలి. కానీ చాలామంది తవ్విన రోడ్లపై మట్టిని నింపి అలాగే వదిలేస్తుండడంతో రోడ్లు ఎగుడు దిగుడుగా ఉండి అటు పాదచారులు, ఇటు వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రధాన రహదారులు ఇష్టారాజ్యంగా..

- ఇటీవల వీరారెడ్డినగర్ చౌరస్తా నుంచి ఇందిరానగర్ వెళ్లే ప్రధాన రహదారిలో డ్రైనేజీ పనులు చేపట్టారు. ఇందుకోసం మెయిన్ రోడ్డు నుంచి విన్నర్ రోడ్డు వరకు తవ్వి పనులు పూర్తి చేశారు. ప్రధాన రహదారిలో కంకర పోసి వదిలేశారు.
- ఇటీవల చెంగిచర్లలోని వివేక్‌నగర్ కాలనీ ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేశారు. తిరిగి రోడ్డు వేయలేదు. కంకర తేలడంతో పాటు ఎగుడు దిగుడుగా ఉంది.
- రెడ్డిస్ కాలనీ నుంచి వాసవీనగర్ మీదుగా మల్లయ్యనగర్ నాలా వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. వాసవీనగర్ రోడ్డు నంబర్–6లో రోడ్డును పగలకొట్టి డ్రైనేజీ పనులు చేపట్టారు. పనులు పూర్తయినా అలాగే వదిలేశారు. దీంతో సదరు రోడ్డు అంతా అపరిశుభ్రంగా మారడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.
- చెంగిచర్ల ప్రివిలేజ్ కాలనీ పక్కన డ్రైనేజీ కలిపేందుకు రోడ్డును తవ్వారు. అలాగే పాత గ్రామపంచాయతీ పక్కన, ఎదురుగా రోడ్డు తవ్వి వదిలేశారు.
- ఇంతా జరుగుతున్న సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.





వివేక్‌నగర్‌లో డ్రైనేజీ కోసం తవ్వగా.. అధ్వానంగా మారిన ప్రధాన రహదారి

కారకులపై చర్యలు తీసుకోవాలి

కొందరు ఇండ్ల యజమానులు తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం కోసం రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్రమంగా రోడ్డు కటింగ్ చేసేవారిపై స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతుల్లేకుండా రోడ్డు కటింగ్ చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– వేణుగోపాల్, బోడుప్పల్

భరత్‌నగర్‌లో 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్'



భరత్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణులు



కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మౌలాలి: మౌలాలి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో భరత్‌నగర్‌లో 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీం హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు, ఉచిత బస్సు ప్రయాణం, నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం, తదితర సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ యాదవ్, లక్ష్మీకాంత రెడ్డి, బీకే శ్రీను, హమీద్, భాస్కర్, చందు, ఫరూక్, శివాజీ, సలీమ్, ఇంతియాజ్, నర్సింహ, భాగ్య రాణి, జాన్వీ, సునీత, పద్మ పాల్గొన్నారు.

సంజయ్‌గాంధీనగర్‌లో..

మల్కాజిగిరి: ఉప్పరిగూడ సంజయ్‌గాంధీనగర్‌లో 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగంపై గౌరవం కూడా లేదన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఉమేశ్‌సింగ్, బీకే శ్రీను, సత్యమూర్తి, సత్యనారాయణ, బాబు, సంపత్ పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో ..

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ హరిజనబస్తీ, కుమ్మరిబస్తీ, జనబస్తీ, రెడ్డి బస్తీలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ఉదయ్, భాస్కర్, చంద్రశేఖర్, అశోక్, శ్రీశైలం, సర్వేష్‌యాదవ్, సూర్యకిరణ్, సంతోష్‌రెడ్డి, సంపత్‌యాదవ్, వెంకటేశ్, కృష్ణ, దేవ, రఘు, శివ, నవీన్, రాజనర్సింహ, శేఖర్, వెంకటేశ్‌గౌడ్, రామ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

200 వారానికి మాలధారణ కార్యక్రమం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

మల్లాపూర్: ఏర్పుల చిన్న, నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నాచారంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలధారణ కార్యక్రమం ఆదివారం 200 వారానికి చేరింది. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత మేడాల మల్లికార్జున్ గౌడ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు శ్రీహరి హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా, అణచివేత లేకుండా స్వేచ్ఛ కల్పించేలా రాజ్యాంగం ద్వారా దిశానిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నూతనకంటి రాజు, రఘు, రాజు, జగదీశ్, సురేశ్, పరశురాం, స్వామి, వీరాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



మేడిపల్లిలో వేడుకల్లో క్రైస్తవులు



వేడుకల్లో పాల్గొన్న గంగరాజు తదితరులు

మేడిపల్లి: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి న్యూ జెరుసలేం మినిస్ట్రీస్ సంఘం ఆధ్వర్యంలో సంఘ కాపరి శశి కిరణ్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘంపెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జేజీఆర్‌లో ..

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు హాజరయ్యారు. పాస్టర్లు పన్నీర్, రవి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, స్కూల్ ఇన్‌చార్జి విజయకుమారి పాల్గొన్నారు.

నేడు మేడ్చల్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పర్యటన

మేడ్చల్: భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 21న (నేడు) మేడ్చల్ లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు కానున్నట్లు అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అత్వెల్లిలో గల జీఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించే సదస్సులో మంత్రి పొంగులేటి, కలెక్టర్ గౌతమ్ పాల్గొంటారని పేర్కొన్నారు. రైతులు సదస్సుకు హాజరు కావాలని వారు కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శామీర్‌పేట్: ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగింది. తూంకుంట మున్సిపాలిటీ శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయం ఎదురుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి మెట్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా తలకు బలమైన గాయాలై మృతిచెందాడు. కాగా మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటాయని, ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదలకు వరం 'సీఎంఆర్‌ఎఫ్'



చెక్కు అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

బోడుప్పల్: సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌కు చెందిన అంకిరెడ్డి నర్సింహారెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరు కాగా సంబంధిత చెక్కును ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్, 11వ డివిజన్ ఇన్‌చార్జి శివయాదవ్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, హరిగోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కార్నివాల్ వేడుకలు

మేడిపల్లి: ఉప్పల్ బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ స్కూల్లో శనివారం కార్నివాల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల చైర్మన్ శ్రీకాంత్, డైరెక్టర్ రూపా రెడ్డి, రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాక్ క్లైంబింగ్, గన్‌శాట్, ట్రాంపోలిన్, రోబోటిక్స్, లాంగ్వేజ్ కార్నర్, కీచైన్ పెయింటింగ్, మ్యాజిక్ షో కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రీజినల్ అకాడమిక్ కోఆర్డినేటర్ జ్యోష్నాదేవి, జోనల్ ఇన్‌చార్జి నీలిమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు



ఆకట్టుకున్న శ్రీరామ జనన వృత్తాంతం

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం శ్రీరామ నాట్యం అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడి జనన వృత్తాంతం నుంచి శ్రీరామ కల్యాణం వరకు నిర్వహించిన ఘట్టాలు ఆకట్టుకున్నాయి. దాదాపు 40 మంది కళాకారులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం



మల్కాజిగిరి: దళితరత్న అవార్డు అందుకున్న సందిగారి నర్సింగరావు, శ్రీరామ్ ఉపేందర్, నీలం సతీశ్‌ను మల్కాజిగిరి ఎస్సీ వెల్ఫేర్ అసోషియేషన్ ఆదివారం సన్మానించింది. చింతల్‌బస్తీలోని అంబేడ్కర్, జగ్జీవన్‌రావు విగ్రహాలకు పూలమాలల వేసే కార్యక్రమం (15 వ వారం) ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు నర్సింగరావు, సుదర్శన్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కీలకంగా పని చేయడమే కాకుండా దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముగ్గురికి అవార్డు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కుమార్, చిరంజీవి, రామరాజు, వెంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం నూతన కమిటీల ఎన్నిక



మల్లాపూర్: మల్లాపూర్ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బెల్లం బక్కయ్య కురుమ, ప్రధాన కార్యదర్శి కంది రాము కురుమ, ఉపాధ్యక్షుడిగా చిగుళ్ల రమేశ్ కురుమ, బొడ్డు నాగ మల్లయ్య కురుమ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చిరునాగుల పాండు కురుమ, సీతాల వెంకటయ్య కురుమ, నాగపురి నర్సింహా కురుమ, సంయుక్త కార్యదర్శులుగా బెల్లం రాజు కురుమ, నర్సింహా కురుమ, మహిపాల్ కురుమ, ప్రచార కార్యదర్శిగా బెల్లం పరమేశ్ కురుమ, మల్లవేణు కురుమ, శ్రీశైలం కురుమ, కోశాధికారి జూకంటి బీరప్ప కురుమ, సలహాదారులుగా సూర్ణం రాజేశ్ కురుమ, చీగుళ్ల శ్రీనివాస్ కురుమ, బండ రాము కురుమ, కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు.

ఉప్పల్ డివిజన్...

ఉప్పల్/రామంతాపూర్ : ఉప్పల్ డివిజన్ కురుమ సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాటి నరసింహ, ఉపాధ్యక్షుడిగా కుంద్రు హనుమంతు, సంయుక్త కార్యదర్శిగా బండ లక్ష్మయ్య, సహాయ కార్యదర్శిగా కరికె నాగరాజు, కోశాధికారి రాజు, సలహాదారులుగా గొరిగే మల్లేశ్‌తో పాటు ఇతరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కంకాల ఏలేందర్, గురిగ రమేశ్, మల్లేశ్, రఘు, కొల్లా బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి అదృశ్యం



తులసీ కుమార్

ఘట్‌కేసర్: బీటెక్ విద్యార్థి అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట్ మండలం సోమారం గ్రామానికి చెందిన పెరుమాళ్ల తులసీ కుమార్ (19) అవుషాపూర్‌లో ఓ ప్రైవేట్ వసతి గృహంలో ఉంటూ స్థానిక విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాగా శనివారం సాయంత్రం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వసతి గృహం నుంచి వెళ్లిపోయాడు. అతడికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో విద్యార్థి తండ్రి ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి ఆర్థిక సమస్యలు, ప్రేమ తదితర కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తుగానే యూనిఫాంలు..!

- 507 ప్రభుత్వ పాఠశాలల్లో 89,465 మంది విద్యార్థులు
- మహిళా సంఘాలతో దుస్తులు కుట్టించేందుకు చర్యలు
- జిల్లాకు చేరిన క్లాత్.. మే 20 వరకు ఒక జత రెడీకి కసరత్తు



సాక్షి,సిటీబ్యూరో: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికే విద్యార్థులకు నూతన ఏకరూప దుస్తులు అందించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు వస్త్రం చేరుకోగా ఎంఈవోలు, ఏపీఎంల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేస్తున్నారు. వారు విద్యార్థుల కొలతలు కూడా తీసుకున్నారు. మండల కేంద్రాల్లో నిర్దేశించిన మండల సమాఖ్య కేంద్రాల్లో కుట్టు పనులు మొదలయ్యాయి. ప్రతి విద్యార్థికీ కనీసం ఒక జత దుస్తులైనా మే 20 లోగా సిద్ధం చేయాలని సంఘాలకు అధికారులు లక్ష్యం విధించారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజు విద్యార్థులు నూతన దుస్తుల్లో హాజరయ్యేలా శ్రద్ధ తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

507 పాఠశాలలు.. 86,465 మంది విద్యార్థులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 86,465 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల కోసం వస్త్రం (క్లాత్)పంపించడంతో మండలాల వారీగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) చేరవేసింది. మొదటి విడతలో వచ్చిన క్లాత్‌ను స్వయం సహాయక సంఘాల మహిళలకు కుట్టేందుకు అప్పగించారు. మిగతా క్లాత్ వచ్చేలోగా ఈ దుస్తుల తయారీ పనులు పూర్తిచేయాలని సంబంధిత ,అధికారులు ఆదేశించారు. జిల్లాలోని 144 మహిళా సంఘాల్లోని 1,099 మంది మహిళా సభ్యులు దుస్తుల తయారీలో నిమగ్నమయ్యారు.

6,7 తరగతుల బాలురకు..

ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి పదో తరగతి బాలురకు మాత్రమే ఇప్పటివరకు ఏకరూప దుస్తుల్లో ప్యాంట్లు అందిస్తున్నారు. అయితే విద్యాశాఖ తాజా నిర్ణయం మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి 6, 7 తరగతుల బాలురకు కూడా నిక్కరు కాకుండా ప్యాంట్ అందించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత కాలంలో ఏడో తరగతి పిల్లలు నిక్కరు తొడగడం సరికాదని తల్లిదండ్రులు పేర్కొనడంతో పాటు నిక్కర్లు వద్దని చాలామంది విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ తాజా నిర్ణయంతో విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

మానిటరింగ్ చేసేందుకు అధికారుల నియామకం

విద్యార్థుల యూనిఫాంలు సత్వరమే కుట్టేలా ఆయా సెంటర్లను మానిటరింగ్ చేసేందుకు ప్రభుత్వం డీపీఎం, ఏపీఎంలను నియమించింది. గతంలో దుస్తులు కుట్టే పనులను స్థానిక కాంట్రాక్టర్లకు అప్పగించటంతో పాఠశాలలు పునఃప్రారంభమై నాలుగైదు నెలలు గడిచే వరకు కూడా యూనిఫాంలు అందించే వారు కాదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ జాప్యానికి చెక్ పెట్టడంతో పాటు స్థానిక మహిళా సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో దుస్తులు కుట్టే పనిని మహిళలకు అప్పగించడంపై మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.